క్లుప్తంగా

నేటి నుంచి పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

- జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నంద్యాల: నేటి నుంచి జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర చాలా కీలకమైందన్నారు. పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాజ అభ్యున్నతి కోసం పోరాడుతున్నారన్నారు. విధి నిర్వహణలో అమరులైన వారందరి త్యాగాలను స్మరించుకుంటూ వారు చేసిన సేవలను గుర్తు చేసుకోవడం మన బాధ్యత అన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో విద్యా, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, హౌసింగ్, విద్యుత్, తాగునీరు, గ్రామీణాభివృద్ధి, అజెండాలో పొందుపరచిన అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

కామాంధున్ని కఠినంగా శిక్షించాలి

ఆళ్లగడ్డ: బద్వేల్‌లో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధుడుని కఠినంగా శిక్షించాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు దస్తగిరి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాలేజీకి వెళ్తున్న బాలికను బైక్‌పై కిడ్నాప్ చేసి అటవీ ప్రాంతంలోకి తీసుకుపోయి అత్యాచారం చేసి అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేయడం దారుణమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలపై కసరత్తు

రుద్రవరం:మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వాహణపై కసరత్తు చేపట్టినట్లు తహసీల్దారు మల్లిఖార్జునరావు తెలిపారు.ఆదివారం ఆయన వీఆ ర్వోలు, ఇతర సిబ్బందితతో కలిసి ఓటరు జాబితా రూపొందించే ప్రక్రియ చేపట్టారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 16 చెరువులు,13 తెలుగుగంగ కాల్వలు కలిపి మొత్తం 29 వాటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇంకా నోటిఫికేషన్ విడుదల కాలేదని అయితే ఓటరు జాబితా సిద్ధ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆ పనులు చేపట్టామన్నారు. నవంబరు నెలలో ఎన్నికలు ఉండొచ్చని ఆయన తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

నంద్యాల: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని ఎస్పీ తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శం



మహమ్మద్ ప్రవక్త జీవితంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మహమ్మద్ ప్రవక్త జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని హదీయా మకాతిప్ ఉభయ తెలుగు రాష్ట్రాల కో ఆర్డినేటర్ మక్బుల్ హుస్సేన్ అన్నారు. స్థానిక అరుణోదయ పాఠశాలలో ఆదివారం మేరే నబి ఫైనల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఉన్నారు.

నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి ఆదివారం 12,000క్యూసెక్కులను అధికారులు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి ఎస్ఆర్ఎంసీ ద్వారా 12,000 క్యూసక్కుల నీరు బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు చేరుతుందని ఈఏ దేవేంద్ర తెలిపారు. ఈ నీటిని తెలుగుగంగ(వీబీఆర్)కు పదివేల క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ వెయ్యి, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు వెయ్యి క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

వీరగాథలు తెలుసుకుందాం..
విజేతలుగా నిలుద్దాం

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థులకు వీర గాథ 4.0 పోటీలు
- దేశభక్తిని పెంచడమే లక్ష్యంగా నిర్వహణ
- ఈనెల 17 నుంచి నవంబర్ 10 వరకు జిల్లా స్థాయిలో పోటీలు
- ఆ తర్వాత రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహణ
- విజేతలకు సత్కారం, నగదు బహుమతులు

సుభాష్ చంద్రబోస్ కలలోకి వచ్చి దేశ సేవ చేయమంటే ఎలా స్పందిస్తారు? తొలి స్వాంతంత్ర్య సమరయోధుడి గురించి చెప్పమంటే ఎవరి గురించి చెబుతారు? ఇలాంటి మరెన్నో అంశాలపై కేంద్ర ప్రభుత్వం వీరగాథల పేరుతో విద్యార్థులకు ఏటా పోటీలు నిర్వహిస్తుంది. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా సాగే ఈ పోటీలు ఈ ఏడాది కూడా ప్రారంభమయ్యాయి.

నంద్యాల(న్యూటౌన్): దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యామంత్రిత్వ, రక్షణ శాఖలు సంయుక్తంగా వీరగాథ 4.0 పోటీలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.

3వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు..

జిల్లా వ్యాప్తంగా మూడో తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు విద్యార్థులకు నాలుగు అంశాల్లో ఈ పోటీలు చేపడుతున్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల గాథలను వివరించడం, వారి త్యాగాలను తెలిపే విధంగా విద్యార్థులకు పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో ఈ నెల 16లోగా ప్రధానోపాధ్యాయులు మైజీవోవీ.ఇన్ వెబ్ పేజీలో వీర్‌గాథ ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు అప్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటికే ఈ పోటీలకు సంబంధించి విద్యాశాఖ, సమగ్ర శిక్షా జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలలకు ఉత్తర్వులు పంపిణీ చేయడంతో పాటుగా, ఆన్‌లైన్‌లో సమావేశాలను నిర్వహించారు. వీరగాథ 4.0లో పాఠశాల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయికి అక్కడ విజేతలైన వారిని రాష్ట్ర స్థాయి, తర్వాత జాతీయ స్థాయికి పంపుతారు. ప్రస్తుతం పాఠశాల స్థాయి పోటీలు ముగిశాయి. ఈనెల 17 నుంచి నవంబరు 10వ తేదీ వరకు జిల్లా స్థాయి, నవంబరు 12 నుంచి 30వ తేదీ మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4 నుంచి 24వ తేదీ మధ్య జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు.

నాలుగు విభాగాల్లో పోటీలు..

పాఠశాలల వారీగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. 3-5 తరగతుల విద్యార్థులకు ఒక విభాగంగా, 6-8 తరగతుల విద్యార్థులకు ఒక కేటగిరి, 9-10 తరగతులకు ఒక కేటగిరి, 11-12 తరగతులకు ఒక కేటగిరిగా విభజించారు. 3-5 తరగతుల విద్యార్థులకు పద్యం, కథ (150 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్ 6-8 తరగతుల విద్యార్థులకు పద్యాలు/కథ (300 పదాలు), చిత్రలేఖనం పెయింటింగ్ మల్టీమీడియా ప్రదర్శన 8-10 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం (700 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన 11-12 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం (1,000 పదాలతో), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన ఉంటుంది. ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో దేశభక్తికి సంబంధించిన ప్రదర్శన వీడియో రూపంలో ఇవ్వడమే మల్టీమీడియాగా పరిగణిస్తారు.



సూపర్ 100 విజేతలు..

వీర గాథ పోటీల్లో పాఠశాల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా, జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ఒక కేటగిరీలో ఎంపికైన వారిని, మరో కేటగిరికి ఎంపిక చేయకుండా వేర్వేరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీల్లో నలుగురిని విజేతలుగా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎనిమిది మందిని విజేతలుగా గుర్తిస్తారు. జాతీయ స్థాయి పోటీల్లో 100 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని సూపర్-100 విజేతలుగా పిలుస్తారు. 3-5 వరకు 25 మంది, 6-8 తరగతుల వరకు 25 మంది, 9-10 తరగతి నుంచి 25, ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ నుంచి 25 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలో విజేతలకు సత్కరించిధ్రువపత్రం అందిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు కేంద్ర విద్యా మంత్రిత్వ, రక్షణ శాఖల వారు రూ.10 వేల వంతున నగదు అందజేస్తారు.

ఎంచుకోవాల్సిన అంశాలు...

వీరగాథ 4.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వారికి నచ్చిన అంశాలను ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్ మోడల్‌గా ఎంచుకుని, వారి నుంచి నేర్చుకున్న విలువలను ప్రస్తావించాలి. ఆ విద్యార్థికి అవకాశం వస్తే ఏమి చేయదలచుకున్నాడో చెప్పాలి. ఉదాహరణకు ఝాన్సీ లక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తారో వివరించాలి. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు, తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్ర్య సమరయోధుల జీవిత కథలు విద్యార్థిపై ఎలా ప్రభావితం చేశాయో చెప్పాల్సి ఉంటుంది. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల తిరుగుబాటు పాత్ర ఇతర అంశాలను ఎంపిక చేసుకుని వివరించవచ్చు.

చక్కని అవకాశం



విద్యార్థుల్లో దేశభక్తిని చాటేందుకు అదే సమయంలో వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇదో చక్కని అవకాశం. వీర్ గాథ 4.0 పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పోటీల నిర్వహణను పర్యవేక్షణ చేయాలి. విద్యార్థులకు నిర్వహించిన పోటీలు, మల్టీమీడియా వీడియోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

–లలిత, ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సర్వశిక్ష అభియాన్, నంద్యాల

పోటీతత్వాన్ని పెంపొందించాలి



వీరగాథ 4.0 కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలి. జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయి. విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చే విధంగా ఉపాధ్యాయులు మార్గ దర్శకత్వం చేయాలి. విద్యార్థుల్లో దేశభక్తిని చాటేలా, స్ఫూర్తిని నింపేలా వీర గాథలు పోటీలు నిర్వహించాలి.

– శామ్యూల్, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, నంద్యాల

అపూర్వ కలయిక..ఆత్మీక పలకరింపు



గురువులతో పూర్వ విద్యార్థులు

చాగలమర్రి: ఒకటి కాదు..రెండు కాదు 26 సంవత్సరాల తర్వాత బాల్య స్నేహితులంతా ఒక చోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి తరగతి స్మృతులను నెమరువేసుకున్నారు. ఇందుకు ముత్యాలపాడు ఎస్‌పీజీ ఉన్నత పాఠశాల వేదికైంది. 1998-98 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. దాదాపు 40 మంది రెండున్నర దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువా వేసి సన్మానించారు. ఈ సమ్మేళనం తమకు ఎంతో సంతృప్తి నిచ్చిందని పూర్వ విద్యార్థి రాజ్‌కుమార్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. నళిని, పూర్వ ఉపాధ్యాయులు భరత్‌భూషన్, సంగీతారాణి, శాంతాకుమారి, డేవిడ్, దివాకర్, జ్ఞానమణి, లారెన్స్, చంద్రకళ, మహానందప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పోర్టు వాహన డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ, ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ హెచ్చరించారు. ఆదివారం రెండో రోజు నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై భారాలు– ప్రభుత్వాల విధానాల అనే అంశంపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు డ్రైవర్ల సంక్షేమానికి తీసుకున్న చర్యలు శూన్యమన్నారు కేరళ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా అన్ని రాష్ట్రాలు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జూలై 1 నుంచి ప్రవేశపెట్టిన భారత న్యాయ సంహిత చట్టం 106, (1)2 రద్దు చేయాలన్నారు. డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని, ప్రతి 50కిలో మీటర్ల వద్ద విశ్రాంతి కోసం భవనాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, లారీ మోటార్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, వీరసేన, రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, వెంకటలింగం, జైలాన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

117 జీవో రద్దుతోనే ప్రాథమిక విద్య బలోపేతం



ఆవిర్భావ దినోత్సవంలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): 117వ జీఓ రద్దుతోనే ప్రాథమిక విద్యకు ప్రాణం వస్తుందని ఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోర్ల సుధాకర్, కుమార్ అన్నారు. ఆదివారం ఎస్‌టీటీఎఫ్ మొదటి ఆవిర్భావ వ్యవస్థాపక దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ, బీఈడీ అర్హతలు ఉన్నా స్కూల్ అసిస్టెంట్ టీచర్లు 3, 4, 5 తరగతులకు బోధన చేసేందుకు ఇబ్బందులకు గురిఅవుతున్నారన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పని వేళలు ఉండేలా మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మత్యనాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు కేషాలునాయక్, కుమార్, శీనునాయక్, ఆంజనేయులు నాయక్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ఆలస్యమవుతున్నందున దీపావళికి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు జూలై నుంచి చెల్లించాల్సిన 3 శాతం డీఏను ప్రకటించిందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని కోరారు. అలాగే మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, బదిలీలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కార్యదర్శి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, రవి, నగిరి వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

దొర్నిపాడు: మండ లంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్ద మ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కమనీయం.. మహానందీశుడి కల్యాణం

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు ఆదివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్య కల్యాణోత్సవంలో భాగంగా అలంకార మండపంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు ఆంజనేయశర్మ, హనుమంతు శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్య ధారణ, అక్షింత సమర్పణ పూజలను వైభవంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని తిలకించి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కుమారస్వామికి విశేష క్రతువులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో ఆదివారం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని వినాయక ఘాట్, లక్ష్మీ గణపతి , నాగులకుంటలోని నాగలింగేశ్వరాలయాల్లో ఆదివారం సంకటాహర చతుర్థిని పురస్కరించుకొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గంధాభిషేకం నిర్వహించారు. తర్వాత మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్పోర్ట్స్

చెస్ ఎంపిక పోటీలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కాంత్రినగర్ శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నంద్యాల జిల్లా ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో ఆదివారం చెస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ మాట్లాడుతూ చెస్ క్రీడ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచుతుందన్నారు. డిసెంబర్ 2వ వారంలో నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంపికైన జట్లు పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో నంద్యాల జిల్లా తరఫున పాల్గొంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో 150 మంది క్రీడాకారులు, కోచ్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ రోజు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునన్నారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు



గోడిగనూరులో ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ కంబగిరి రాముడు

చాగలమర్రి: గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు హెచ్చరించారు. ఆదివారం ఆయన సమస్యాత్మక గ్రామమైన గోడిగనూరు గ్రామంలో పర్యటించారు. పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించి మారణాయుధాలు, రికార్డులు లేని 45 ద్విచక్ర వాహనాలను స్వాధీన పరచుకొని చాగలమర్రి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ మాట్లాడుతూ చిన్న కారణాలతో 2017లో గ్రామానికి చెందిన పల్లె నరసింహుడు, పల్లె శుభాష్ అనే వ్యక్తులు హత్యకు గురి అయ్యారన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు 5గురిపై కేసు నమోదైందని, అప్పటి నుంచి గ్రామంలో పోలీసు పికెట్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద రౌడీ షీటర్లు, గ్రామస్తులతో సమావేశమై గొడవల జోలికి వెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ టౌన్, సిరివెళ్ల సీఐలు చిరంజీవి, వంశీధర్, చాగలమర్రి, ఆళ్లగడ్డ రూరల్, టౌన్, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, శిరివెళ్ల, రుద్రవరం ఎస్ఐలు రమేష్ రెడ్డి, హరిప్రసాద్, జయప్పా, రామాంజనేయరెడ్డి, వెంకటేశ్వర్లు, పీరయ్య యాదవ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలు నేర్చుకోవాలి



మువ్వ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులు మన సంప్రదాయ నృత్యాలు నేర్చుకోవాలని సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకులు యోగానంద పల్లంశెట్టి సురేష్ అన్నారు. కూచిపూడి నాట్యంలోని మువ్వ పూజను పాములేటి స్వామి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు ప్రదానం



షేక్షావలిరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణానికి చెందిన శ్రీగురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. బెస్ట్ డైరెక్టర్ విభాగంలో సదరన్ ప్రైవేటు లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఆయనను ఎంపిక చేసింది. ఆదివారం విజయవాడలోని ఏపీ కాలేజీ అసెంబ్లీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. నాగయ్య తెలిపారు. పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి చిన్న వయస్సులోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కాగా అవార్డు అందుకున్న షేక్షావలిరెడ్డిని గురురాజ ఉపాధ్యాయుల బృందంతో పాటు మోజేష్, రాణి, అమృత, వర్షిణి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆహ్వాన సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలపైన అవగాహన అవసరమని నంది బాలోత్సవాల ఆహ్వాన సంఘం కన్వీనర్ రామరాజు అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు సుజల, మిద్దెశివరాం, కార్యనిర్వాహక కార్యదర్శి మౌలాలి, డాక్టర్ గురుస్వామి, డాక్టర్ వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, శంకరయ్య, క్రాంతి కుమార్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. నంది బాలోత్సవం పేరుతో గత ఏడాది జిల్లాలో బాలోత్సవాలు విజయవంతంగా జరిగాయన్నారు. ఈ ఏడాది కూడా డిసెంబర్‌లో బాలోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంబాటిళ్లు చూపుతున్న పోలీసులు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న హుసేన్ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి అతని ఇంటిపై దాడులు నిర్వహించగా 49 మద్యం బాటిళ్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఇళ్ల మధ్యే మురుగు

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. స్థానిక బీసీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు గృహాల మధ్య చేరి కుంటలను తలపిస్తున్నాయి. వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రహదారులపైనే ఆగుతుంది. అలాగే గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. దోమల బెడదతో ఎక్కడ తమకు జ్వరాలు వస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



మాయలూరు బీసీ కాలనీలో నిలిచిన వర్షపు నీరు